ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
ఆదివారం 24 ఆగస్టు 2025

గురునానక్ యూనివర్సిటీలో లా కోర్సులు ప్రారంభం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ యూనివర్సిటీ తన విద్యా ప్రస్థానంలో మరో కీలక మైలురాయిని సాధించింది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఆమోదం పొందిన నూతన న్యాయ కోర్సులు బీఏ ఎల్ఎల్బీ (ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు), ఎల్ఎల్బీ (హానర్స్) మూడేళ్ల ప్రోగ్రాంలు ప్రారంభిస్తున్నట్లు గురునానక్ యూనివర్సిటీ యాజమాన్యం ప్రకటించింది. ఈ కోర్సులు విద్యార్థులకు నాణ్యమైన విద్య, ప్రాక్టికల్ శిక్షణ, నైతిక విలువలపై దృష్టి సారించేలా రూపొందించబడ్డాయని తెలిపింది.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు

రేపటి నుంచి జ్వర సర్వే

ఇంటింటికీ రానున్న ఆశాలు, ఏఎన్ఎంలు

జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టడంతో పాటు సోమవారం నుంచి ఇంటింటికీ తిరిగి జ్వర సర్వేను నిర్వహించాలని డీఎంహెచ్‌వో బి.వెంకటేశ్వరరావు వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లు, ఏఎన్ఎమ్‌లు ఇంటింటికీ తిరిగి జ్వరాల సర్వే చేపట్టాలన్నారు. వైద్య అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుంటూ ప్రజల ఆరోగ్యాలతో ముడిపడి ఉన్న శానిటేషన్ నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా నీరు నిలిచిన ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్‌ను వేయాలని సూచించారు. ట్యాంకులలో నిల్వఉన్న నీటిని తీసేయాలని, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి డెంగీ, మలేరియా, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య, పంచాయతీరాజ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ముందు జాగ్రత్తగా ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. డ్రైనేజీల్లో చెత్తాచెదారం శుభ్రం చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రోగ నిరోధకత అధికారి డాక్టర్ షికాయత్, డాక్టర్ విజయ పూర్ణిమ, జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గణనాథులు సిద్ధం

ముస్తాబవుతున్న మండపాలు
కొలువుదీరేందుకు తరలుతున్న విగ్రహాలు
వివిధ ఆకృతుల్లో ప్రతిమల తయారీ

7




ట్రెక్కింగ్ చేస్తున్న పర్యాటకులు(ఫైల్)

తెలంగాణ ఊటీగా పిలుచుకునే అనంతగిరి.. ఆహ్లాదకరమైన ప్రకృతి, ఆధ్యాత్మికతకు పెట్టింది పేరు. ఇక్కడ పక్షుల కిలకిలా రావాలు, మయూరాల నృత్యాలు, జింక పిల్లల పరుగులు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తుంటాయి. ఈ నేపథ్యంలో పర్యాటకుల అవసరమైన వసతులు కల్పించేందుకు అటవీ అభివృద్ధి సంస్థ ముందుకు వచ్చింది. ఈ కొండల్లో బస ఏర్పాటుతో పాటు సఫారీ రైడ్ ద్వారా వారికి ఒక మధురమైన జ్ఞాపకాలను మిగిల్చేలా ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

Sunday Special

పర్యాటకులకు పరవశమే

'అనంతగిరి'లో సఫారీ రైడ్, ట్రెక్కింగ్





రాత్రంతా అడవిలో గడిపేందుకు కాటేజీలు
స్పెషల్ ప్యాకేజీలు సిద్ధం చేసిన అధికారులు
రూ. 45లక్షలతో ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
త్వరలో ప్రారంభానికి అధికారుల కసరత్తు

వికారాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇప్పటికే శని, ఆదివారాలు వస్తే చాలు అనంతగిరికి వేల సంఖ్యలో పర్యాటకులు క్యూ కడుతుంటారు. అయితే ఇక్కడ రాత్రి వేళ బస చేసేందుకు అనువైన స్థలం లేకపోవడంతో కాస్త ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అటవీ అభివృద్ధి సంస్థ(ఎఫ్‌డీసీ) పర్యాటకులకు సౌకర్యాలు కల్పిస్తూ అడవిలో అర్ధరాత్రి ఆనందంగా గడిపేందుకు రూ.45 లక్షల నిధులతో కాటేజీలను సిద్ధం చేసింది. ఆ కాటేజీలకి 'ది బ్రీజ్' గా నామకరణం చేసింది. ఫారెస్ట్ గెస్ట్ హౌస్ ఆవరణలో నాలుగు కాటేజీలను సిద్ధం చేశారు. అందులో 15గంటల వరకు

మిగతా 7వ పేజీలో...


అనంతగిరి అటవీ ప్రాంతం

రాత్రంతా అడవిలో..

ఈ కాటేజీల్లో ఉండేందుకు పర్యాటకులు మధ్యాహ్నమే అక్కడకు చేరుకోవాల్సి ఉంటుంది. వచ్చిన వారికి వెంటనే స్నాక్స్ అందించి రాత్రికి డిన్నర్ అందిస్తారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్‌తో ప్యాకేజీ ముగుస్తుంది. ఆ సమయంలోనే పర్యాటకులకు క్షణక్షణం ఏం అందించాలి? ఏ ప్రదేశాలు చూపించాలి? ఎలాంటి యాక్టివిటీస్ చేయాలని ఒక ప్రణాళికను ఇప్పటికే సిద్ధం చేశారు. ప్యాకేజీలో ఒక్కో గదిలో ఒకరు నుంచి ముగ్గురు చొప్పున ఉండే విధంగా చూస్తున్నారు. ఇందులో మనుషుల సంఖ్యను బట్టి రూ.5 వేలు, రూ.3,800, అదనంగా ఉంటే మరో రూ.2,500 చెల్లించాల్సి ఉంటుంది.


ద బ్రీజ్ గెస్ట్ హౌస్

త్వరలోనే అందుబాటులోకి..



అనంతగిరిలో పైలెట్ ప్రాజెక్ట్‌గా రూ.45 లక్షల నిధులతో కాటేజీలను ఏర్పాటు చేశాం. ఇక్కడ పర్యాటకులకు ప్యాకేజీలో భాగంగా రాత్రి బస సౌకర్యాలు కల్పించి భోజనం, సఫారీ రైడ్‌ను అందిస్తాం. భవిష్యత్తులో అనంతగిరిలో మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. త్వరలోనే ఈ ప్యాకేజీలను ప్రారంభించనున్నాం.

- శ్రీనివాస్‌రావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్


సఫారీ రైడ్‌కు సిద్ధంగా ఉన్న జీప్


గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన కాటేజీలు

బంతిపూల సోయగం



యాచారం మండలం చౌదర్‌పల్లి గేటు వద్ద ఉన్న బంతిపూల తోట చూపరులను పరవశింపజేస్తుంది. మూడు రకాల రంగుల పూలు విరగబూసి సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై వచ్చిపోయే ప్రయాణికులను ఆకర్షిస్తున్నాయి. కొందరు వాహనదారులు పూలతోటలో ఫొటోలు దిగి మురిసి పోతున్నారు.

యాచారం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి)

సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్



ఆదిభట్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపాలిటీని సీఎస్ఆర్, జనరల్ నిధులతో అభివృద్ధి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ 15వ వార్డులో ఉన్న స్కూల్‌ను పర్యవేక్షించి మౌలిక వసతులు కల్పించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. వర్షాలకు రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. పార్క్ స్థలాలను అభివృద్ధి చేయాలన్నారు. వైకుంఠధామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలను విరివిగా నాటాలన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తర్వాతనే ఇంటి నెంబర్లు జారీ చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, మేనేజర్ రమేష్, డీఈ స్వర్ణకుమార్, టౌన్‌ప్లానింగ్ అధికారి హబీబ్ ఉన్నీసాబేగం పాల్గొన్నారు.


సోలీపూర్‌లో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పక్కన వేసిన చెత్త

కంపుతో సహవాసం!

ఓ వైపు డంపింగ్ యార్డు.. మరో పక్కన మురుగు
అవస్థల్లో సోలీపూర్ వాసులు.. రోగాలతో సతమతం
సమస్యను పరిష్కరించాలని గ్రామస్తుల వేడుకోలు


సోలీపూర్‌లో నిలిచిన మురుగు

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించిన సోలీపూర్ గ్రామ ప్రజలు నేడు ఓ వైపు చెత్తతో.. మరోవైపు మురుగు నీటితో సావాసం చేస్తున్నారు. దుర్గంధం మధ్య నివసిస్తూ రోగాల బారిన పడి నిత్యం సతమతమవుతున్నారు. ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఉన్న సోలీపూర్‌ను మున్సిపాలిటీలో విలీనం చేసిన తర్వాత గ్రామస్తులకు ఈ కష్టాలు ప్రారంభమయ్యాయి. గతంలో సోలీపూర్ దళితులకు ప్రభుత్వం అసైన్డ్ భూములు పంపిణీ చేశారు. వాటిని దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నారు. కానీ, బైపాస్ రోడ్డు నిర్మాణ

మిగతా 8వ పేజీలో...

పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డీఆర్‌డీవో పీడీ శ్రీలత
సామాజిక తనిఖీల్లో సిబ్బందిపై ఆగ్రహం

చౌదరిగూడ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని డీఆర్‌డీవో పీడీ శ్రీలత హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో చేపట్టిన నాలుగవ ఉపాధి హామీ సామాజిక తనిఖీ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. 2024 సంవత్సరంలో మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వనమహోత్సవంలో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిచేయని పంచాయతీ కార్యదర్శులు, టీఏ, ఎఫ్ఏలపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి హామీ పనులను పక్కాగా చేపట్టాలని అన్నారు. నువ్వేం టీఏవు.. ఏం చేస్తున్నావ్ అంటూ వినోద్‌పై మండిపడ్డారు. ఆయన ఏం డ్యూటీ చేస్తున్నాడో పరిశీలించాలంటూ ఇన్‌చార్జి ఎంపీడీవో హన్మంత్‌రెడ్డిని ఆదేశించారు. అలాగే వనమహోత్సవంలో భాగంగా గ్రామాల్లో మొక్కలను నాటడంలో పూర్తిగా వెనుకబడ్డారని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో అడిషనల్ పీడీ సుభాషిణి, అంబుడ్స్‌మెన్, ఏపీడీ చరణ్ గౌతమ్, సోషల్ ఆడిటర్ కాశన్న, సునీత, ఏపీవో నర్సింగ్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.


ఉపాధి హామీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ శ్రీలత

విద్యాభివృద్ధికి సర్కార్ పెద్దపీట

● ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ● ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులకు శ్రీకారం

కొందుర్గు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంటర్నేషనల్ స్కూళ్లతో పోటీపడేలా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను నిర్మించి కార్పొరేట్ విద్యనందిస్తామన్నారు. ఈ పాఠశాల విద్యార్థుల భవిష్యత్‌కు పునాది కాబోతుందని తెలిపారు. రూ.200 కోట్ల నిధులతో త్వరలోనే పాఠశాల నిర్మాణ పనులు చేపడుతారని తెలిపారు. అదేవిధంగా రైతుల కోసం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, పోల్స్, వైర్లు, అవసరమైన సామగ్రి అందుబాటులో ఉన్నాయని వివరించారు. స్టేడియం, నాలుగు లేన్ల రహదారి లాల్‌పహాడ్ నుంచి షాద్‌నగర్ వరకు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీఅనురాధ, ఇన్‌చార్జి ఎంఈవో గాయత్రీదేవి, ఎంపీవో విజయపాల్, తహసీల్దార్ రమేష్‌కుమార్, సర్వేయర్ ఆంజనేయులు, విద్యుత్‌శాఖ డీఈ శ్యాంసుందర్ రెడ్డి, ఏఈ, లైన్‌మెన్‌లు, ఇంటిగ్రేటెడ్ పాఠశాల కాంట్రాక్టర్ రఘు, ఏఈ విక్రం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాజు, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, సయ్యద్ సాదిక్, మహ్మద్ ఇబ్రహీం, బాల్‌రాజ్ గౌడ్, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్ గౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.


ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కేసులు

మహేశ్వరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, సీలింగ్ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని తుక్కుగూడ మున్సిపాలిటీ మంఖాల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 70, 71, 72, 73లో మంఖాల్, తుక్కుగూడ గ్రామాలకు చెందిన పది మంది రైతులకు సంబంధించి సుమారు 23ఎకరాల సీలింగ్ భూమి కబ్జాకు గురైనట్లు అధికారులు గుర్తించారు. శనివారం ఆ భూముల్లో ఉన్న రోడ్లు, నిర్మాణాలను పోలీసుల సహకారంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వ, సీలింగ్ భూములు, చెరువులు, కుంటలను ఎవరు ఆక్రమించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అదేవిధంగా రైతులు సీలింగ్ భూములను వ్యవసాయం చేసుకోకుండా ఇతరులకు విక్రయిస్తే వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందన్నారు. మంఖాల్ రెవెన్యూలోని 23 ఎకరాల సీలింగ్ భూముల వివరాల నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి వాటిని ప్రభుత్వ భూములుగా రికార్డుల్లో నమోదు చేస్తామన్నారు. మంఖాల్ రెవెన్యూలో కబ్జాకు గురైన భూముల్లో నిర్మాణాలను తొలగించి వాటిల్లో ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా పట్టా భూములకు కూడా అధికారులు ఫెన్సింగ్ వేస్తున్నారని రైతులు ఆరోపించారు. అయితే వారివద్ద ఉన్న పట్టా భూముల రికార్డులను మండల రెవెన్యూ కార్యాలయానికి తీసుకువస్తే వాటిని పరిశీలించాక తగిన న్యాయం చేస్తామని రైతులకు వివరించారు.


ఆర్డీవోను నిలదీస్తున్న రైతులు

సేవా కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం

చేవెళ్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి అన్నారు. సత్యసాయి శత వారికోత్సవ వేడుకల్లో భాగంగా బాల వికాస్ కార్యక్రమాన్ని శనివారం మండల పరిధి కౌకుంట్ల ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడలు, చిత్రలేఖనం, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే పంచాయతీ పారిశుధ్య కార్మికులకు, అంగన్వాడీ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యసాయి సేవా సమితి దశాబ్దాలుగా గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఇతరులకు స్ఫూర్తిమంతంగా నిలుస్తోందన్నారు. ఇది గొప్ప విషయం అన్నారు. ప్రజలు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సేవా సమితి మండల కన్వీనర్ రామాగౌడ్, సభ్యులు గోపాలచారి, మాణిక్యరెడ్డి, పెంటారెడ్డి, సతీశ్, శివరాం, శ్రీనివాస్‌గౌడ్, భజన మండలి, యువకులు, టీచర్లు ఉన్నారు.


కౌకుంట్లలో సత్యసాయి సేవా సమితి సభ్యులతో కృష్ణారెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలి

వికారాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వానకాలం సీజన్ ధాన్యం సేకరణకు వడ్ల కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. వరి ధాన్యం సేకరణ ముందస్తు కార్యాచరణ ప్రణాళికపై శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సన్న, దొడ్డు రకాల వడ్లను వేర్వేరుగా సేకరించాలన్నారు. జిల్లాలో దొడ్డు వడ్లు 31,200 టన్నులు, సన్నరకం 73,800 టన్నుల సేకరణకు అంచనా వేశామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తూనిక, తూర్పారబెట్టే యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని, తగినన్ని సంచులను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో శ్రీనివాస్, వ్యవసాయ అధికారి రాజరత్నం, డీసీఎస్‌వో సుదర్శన్, డీఎంసీఎస్ మోహనకృష్ణ, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, డీసీవో నాగార్జున, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

మీ సేవ సెంటర్ల నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే చర్యలు

మీ-సేవ కేంద్రాల నిర్వాహకులు ప్రజల నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు కంటే ఎక్కువ తీసుకుంటే వారి లైసెన్స్ రద్దు చేస్తామని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో మీసేవ కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మీ సేవ కేంద్రాల్లో ఇచ్చే రసీదులో ఉండే రుసుము కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులొస్తున్నాయని, నిజమని తేలితే మీ సేవ కేంద్రం గుర్తింపును రద్దు చేస్తామన్నారు. అన్ని పని దినాల్లో కేంద్రాలను తెరవాలని సూచించారు. కుల, ఆదాయ సర్టిఫికెట్ల, కల్యాణలక్ష్మి దరఖాస్తులకు ప్రభుత్వం నిర్దేశించిన రుసుము మాత్రమే తీసుకోవాలని ఆదేశించారు. మీ సేవ కేంద్రానికి వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని తెలిపారు. అనుమతిపొందిన చోటనే కేంద్రాన్ని నిర్వహించాలన్నారు. రుసుం పట్టికలను పెద్ద బోర్డులపై ప్రదర్శించాలని సూచించారు. అధిక రుసుము వసూలు చేస్తే ప్రజలు 1100కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా మేనేజర్ మహమూద్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ఇబ్రహీంపట్నంలో ఫీజు దీక్ష చేశారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు బోడ వంశీ, ఏర్పుల తరంగ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆరేళ్ల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు రూ8,150కోట్లు విడుదల చేయాల్సి ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిందని ఆదే కోవలో కాంగ్రెస్ ప్రభుత్వంకూడా ఈ నిధులను విడుదల చేయకుండా విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలను ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలు క్లాసులు నడపకుండా, పరీక్షల నిర్వహణలో ఆలస్యం చేసిన ఘటనలున్నాయని తెలిపారు. అంతేగాక కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడంతో పైచదువులకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్, జస్వంత్, వినయ్, ప్రదీప్, కిషోర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నంలో ఫీజు దీక్ష చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కళాశాల భవన నిర్మాణం పూర్తి చేయకపోతే ఉద్యమం

ఆమనగల్లు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకటేశ్ ఆరోపించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన అసంపూర్తి పనులను పూర్తి చేయించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షను శనివారం ఆయన సందర్శించారు. దీక్షల్లో కూర్చున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు, విద్యార్థులకు సంఘీభావం ప్రకటించారు. ఆమనగల్లులో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి 24ఏళ్లు గడిచినా సొంత భవనం నిర్మించకపోవడం సరికాదన్నారు. భూ వివాదాన్ని పరిష్కరించి నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, రాజు, మల్లేశ్, శంకర్, గణేశ్, కురుమయ్య, శివశంకర్ ఉన్నారు.


దీక్షలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి

ఆదిభట్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): చింతపల్లిగూడలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ప్రజలు కమిషనర్ బాలకృష్ణకు శనివారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ చింతపల్లిగూడలో ప్రభుత్వ స్థలాన్ని జోగు స్వామి ఆక్రమించాడని తెలిపారు. అదే స్థలంలో వాటర్ ట్యాంక్, హైమాస్ట్ లైట్లు, వినాయక మండపం ఉండేవన్నారు. వీటన్నింటినీ స్వామి కూల్చివేసి స్థలంలో మరమ్మతులు చేస్తున్నాడని తెలిపారు. కాగా స్వామి రికార్డుల్లో తనకున్న స్థలం కంటే ఎక్కువగా ఆక్రమించాడని కమిషనర్ తెలిపారు. అధికారులు స్థలాన్ని కాపాడి హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో జోగు సంజీవ, గణేష్, శేఖర్, బాలయ్య, ఇబ్రహీం, మల్లయ్య, భాస్కర్‌రెడ్డి, మైసయ్య, రమేష్, యాదయ్య, నర్సింహ, స్వామి ఉన్నారు.


ఫిర్యాదు చేస్తున్న చింతపల్లిగూడ వాసులు

దేవర చెరువుకు మరమ్మతులు

కడ్తాల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కడ్తాల్‌లోని దేవర చెరువుకు మరమ్మతులు చేసినట్టు పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జహంగీర్ అలీ శనివారం తెలిపారు. పనులను ఇరిగేషన్ శాఖ ఏఈ మహేందర్‌రెడ్డి, కార్యదర్శి అల్లాజీ, రైతులతో కలిసి పరిశీలించారు. ఇటీవలి వర్షాలకు చెరువుకట్ట కుంగి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న దృష్ట్యా ఫార్చ్యూన్ బటర్ ఫ్లై సిటీ నిర్వాహకుల సహకారంతో పనులను చేపట్టినట్లు తెలిపారు. చేగూరి రాములు, లక్ష్మణ్‌రావు, సర్వేయర్ అలీ, జంగయ్య, రాజు, చింటు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం



మొయినాబాద్/షాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మొయినాబాద్ పరిధి సురంగల్ వార్డులో కట్టమైసమ్మ ఆలయం వద్ద భాస్కర్ ఆసుపత్రి వైద్యులు శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ప్రజలకు కంటి, దంత, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. 150మందికి పరీక్షలు చేసినట్లు వైద్యురాలు క్రాంతి తెలిపారు. షాబాద్ మండలం కుమ్మరిగూడలో పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రి వైద్యశిబిరాన్ని నిర్వహించింది. మాజీ సర్పంచ్ కేతనరమేశ్ మాట్లాడుతూ.. వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని

రోడ్డుకు అడ్డుగా ఉన్న గోడ కూల్చివేత

ఆదిభట్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల పరిధి శ్రీ అంజలి వెంచరకు వెళ్లకుండా రోడ్డుకు అడ్డుగా ఉన్న ప్రి కాస్ట్ వాల్‌ను హైడ్రా అధికారులు శనివారం కూల్చివేశారు. హైడ్రా సీఐ తిరుమలేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బీరప్పగుడి సమీపంలో ఉన్న శ్రీ అంజలి వెంచర్‌కు ఉన్న రోడ్డును స్థానికులు ఆక్రమించి ప్రికాస్ట్ వేశారు. ప్లాట్ల యాజమానులు ఫిర్యాదుతో జేసీబీతో కూల్చేశామని చెప్పారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

కులకచర్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో పరిగి తాలూకా జోనల్ స్థాయి అండర్-14, 17 బాలబాలికల వాలీబాల్ పోటీలు శనివారం ముగిశాయి. అండర్-14 బాలుర విభాగంలో పరిగి సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు, అండర్-17 విభాగంలో ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్ బాలురు నిలిచారు. అండర్-14 బాలికల విభాగంలో ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్, అండర్-17 విభాగంలో సాల్విడ్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు నిలిచారు.

కలెక్టరేట్‌లోకి కుక్కలు



కలెక్టరేట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో లోపలికి వెళుతున్న కుక్క



కలెక్టరేట్ మొదటి అంతస్తులో ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి కార్యాలయం వద్ద సంచరిస్తున్న కుక్క

వికారాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్‌లో ఎక్కడ చూసినా కనిపించే వీధి కుక్కలు ఏకంగా కలెక్టరేట్‌లోకి ప్రవేశించడం చర్చనీయాంశమైంది. శనివారం ఓ కుక్క మెట్ల మార్గంలో మొదటి అంతస్తులో కార్యాలయాల వద్దకు వెళ్లడం అందరినీ విస్తుపోయేలా చేసింది. కలెక్టరేట్‌లో కుక్కలు తిరుగుతున్నా సిబ్బంది పట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల పరిగి, కొడంగల్, మన్నేగూడలో కుక్కలు దాడిచేసి పలువురిని గాయపరిచిన ఘటనలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఇలాంటి సమయంలో కుక్కలు కలెక్టరేట్‌లో తిరగడం పట్ల సందర్శకుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాలని, విచారణలో నాణ్యతను పెంచి నిందితులకు త్వరగా శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఫిర్యాదుదారునికి న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. పాఠశాలల్లో బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌పై చైతన్యం కల్పించాలన్నారు. జిల్లాను గంజాయి, డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా జరిగేందుకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. డీజేలను నిషేధించామని స్పష్టం చేశారు. సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు సహకరించాలి

శాంతి భద్రతలకు ప్రజల సహకారం అత్యంత అవసరమని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. వినాయక నవరాత్రులను పురస్కరించుకుని శనివారం వికారాబాద్‌లోని గౌలికార్ ఫంక్షన్‌హాల్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిమజ్జనం సమయంలో తొక్కిసలాటలు జరుగకుండా వలంటీర్లను నియమించుకోవాలని తెలిపారు. సోషల్ మీడియా వదంతులను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, పోలీస్ అధికారులు, పీస్ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా కట్టమైసమ్మ ఆలయ వార్షికోత్సవాలు



విశ్వశాంతి చండీ హోమంలో భక్తులు

ఆమనగల్లు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : ఆమనగల్లులోని కట్టమైసమ్మ ఆలయంలో శనివారం ప్రథమ వార్షికోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ చైర్మన్, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మొక్తాల వెంకటయ్య ఆధ్వర్యంలో భక్తులకు విశాల వసతులు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, డీసీపీ రాజేశ్, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, ఎస్ఐలు వెంకటేశ్, వరప్రసాద్ హాజరయ్యారు.సాయంత్రం వరకు పూజలు, హోమాలు, అభిషేకాలు కొనసాగాయి. గాయత్రీదేవి ఉపాసకురాలు శాంకరి అఘోరి మాత ఆధ్వర్యంలో నిర్వహించిన చండీ విశ్వశాంతి హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎండుమిర్చితో హోమం చేశారు. కడ్తాల సీఐ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, లలితవెంకటయ్య, సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, నాయకులు విజయ్‌కృష్ణ, శ్రీకాంత్‌సింగ్, వెంకటయ్య, రాజు, యాదయ్య, మహేశ్, అంజయ్య, సాయి, జగన్, కృష్ణనాయక్, వెంకటయ్య, రూపం వెంకట్‌రెడ్డి, సైదులు, మల్లేశ్, శశికుమార్, బలామణి, మానస, మంగమ్మ, పద్మ, ఉమాభారతి, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

గోపులారంలో పశువైద్య శిబిరం



మందులను అందజేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారి మధుసూదన్

శంకర్‌పల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మధుసూదన్ తెలిపారు. గోపులారంలో శనివారం సత్యసాయి సేవాసమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో యనిమల్ హెల్త్-ఫెర్టిలిటీ క్యాంప్‌ను నిర్వహించారు. పశువులకు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి అవసరమైన సమయాల్లో చికత్సలు చేయించాలని వైద్యులు సూచించారు. 105 పశువులకు గర్భకోశ, పాల దిగుబడికి సంబంధించిన వ్యాధులకు చికిత్స చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో మహరాజ్‌పేట్, శంకర్‌పల్లి పశువైద్యాధికారులు శ్రావణిగౌడ్, మానసరెడ్డి. రైతులు శేఖర్, శేషానంద్, సంజీవ, రాజు, కార్తీక్, ఎట్టయ్య రైతులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

బంట్వారం ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ బంట్వారం మండల అధ్యక్షుడు దుర్గంచెరువు మల్లేశం అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు శరణరెడ్డి, ఖాజా పాషా, అంతిరెడ్డి, కలీం పాషా, బల్వంతరెడ్డి, నరేశ్, ఖదీర్ పాల్గొన్నారు.



కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రక్తదానంతో ప్రాణదాతలు కావాలి



రక్తదాతకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడడంలో రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రక్త, నేత్ర, అవయవ దానాలపై ప్రజల్లో అపోహలను తొలగించి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, వైద్యులు, విద్యావంతులు కృషిచేయాలని కోరారు. కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని నాయకులు, వైద్యులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. రక్తదాతలకు ప్రశంస పత్రాలు అందజేశారు. వైద్య సదుపాయాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదల వైద్య చికిత్సలకు రూ. 10లక్షల సాయమందిస్తోందని తెలిపారు. కల్వకుర్తిలో వంద పడకలు, ఆమనగల్లులో 30పడకల ఆసుపత్రులను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. కడ్తాలలో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని పీహెచ్‌సీలను ఆధునికీకరిస్తామని చెప్పారు. నాయకులు బాలాజీసింగ్, బృంగి ఆనంద్, సంజీవ్‌కుమార్, పర్వతరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

జైపాల్‌రెడ్డికి ఎమ్మెల్యే పరామర్శ

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు జైపాల్‌రెడ్డిని ఎమ్మెల్యే నారాయణరెడ్డి పరామర్శించారు. జైపాల్‌రెడ్డి తండ్రి వెల్దండ రామచంద్రారెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. శనివారం తిరుమలాపూర్‌లో రామచంద్రారెడ్డి మృతదేహానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. రామచంద్రారెడ్డి సతీమణి కౌసల్యమ్మ, వారి కుమారులు యాదవరెడ్డి, లక్ష్మారెడ్డి, జైపాల్‌రెడ్డి, కూతురు అలివేలమ్మలను పరామర్శించారు. పరామర్శించిన వారిలో సీఎం సోదరుడు కృష్ణారెడ్డి, కేవీఎన్‌రెడ్డి, రఘుమారెడ్డి, చిగురింత నర్సింహారెడ్డి, ఆసిఫ్ అలీ,కేశవులు, ఆనంద్, శ్రీను, లక్ష్మయ్య, శశిధర్‌రెడ్డి తదితరులున్నారు.



గణనాథులు సిద్ధం

● మండపాల్లో కొలువుదీరేందుకు తరలుతున్న విగ్రహాలు ● ఉత్సవాలకు అంతా రెడీ



మేడ్చల్‌లో లంబోదరులు

మేడ్చల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వినాయక చవితికి విగ్రహాలు సిద్ధమయ్యాయి. ఈ నెల 27 నుంచి నవరాత్రుల నుంచి గణనాథుడు పూజలందుకోనున్నాడు. వాడవాడలా గణేశుడిని ప్రతిష్ఠించేందుకు నిర్వాహకులు మండపాలను సిద్ధం చేస్తున్నారు. మేడ్చల్ సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారికి ఇరువైపులా కళాకారులు గుడారాలు వేసుకొని గణేశుడి విగ్రహాలను తయారు చేసి విక్రయానికి పెట్టారు. అత్వెల్లి సమీపంలో రేకులబావి వద్ద విగ్రహాలను పెద్ద ఎత్తున తయారు చేశారు. అమ్మకాలు జోరుగు కొనసాగుతున్నాయి.



మేడ్చల్‌లో విగ్రహాన్ని తయారు చేస్తున్న కళాకారుడు

రూ.వందల నుంచి వేలల్లో ధరలు

మేడ్చల్‌కు 50కిలోమీటర్ల దూరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి విగ్రహాలను కొని వాహనాల్లో తీసుకువెళ్తున్నారు. సైజును బట్టి ఒక్కో విగ్రహం ధర రూ.1,500 నుంచి లక్ష రూపాయల వరకు ఉంది. ఈ నెల 27న వినాయక చవితి నేపథ్యంలో మేడ్చల్, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల నుంచి వచ్చి విగ్రహాలను తీసుకుపోతున్నారు. అలాగే హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి, సుచిత్ర, కొంపల్లి ప్రాంతాల నుంచి విగ్రహాల కోసం వస్తున్నారు. వివిధ ఆకృతుల్లో వేలాది విగ్రహాలను చేశారు. ఈ ఏడాది ఇప్పటికే వర్షాలు కురిసి చెరువులు, కుంటల్లో నీరు చేరడంతో పెద్దఎత్తున విగ్రహాలు అమ్మకాలు జరుగుతాయని కళాకారులు, విగ్రహ తయారీదారులు ఆశిస్తున్నారు.

మట్టి గణపతులకు జైకొట్టాలి



ఆమనగల్లులో మట్టి వినాయకుల పంపిణీ (ఫైల్)

ఆమనగల్లు: వాడవాడలా గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తారు. ఆమనగల్లులో విగ్రహాలు, పూజాసామగ్రి విక్రయాలు జోరందుకున్నాయి. కాగా పీవోపీతో చేసిన లంబోదరుడి విగ్రహాలు రంగులు, ఇతర రసాయనాలతో పర్యావరణ కాలుష్యానికి కారకమవుతాయి. మట్టి గణపతులే శ్రేష్ఠమని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, పర్యావరణ హితులు ప్రచారం చేస్తున్నా ప్రజలు 90శాతానికిపైగా రంగు విగ్రహాలనే ప్రతిష్ఠిస్తున్నారు.

పర్యావరణానికి హాని కలిగించొద్దు



పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. మట్టి వినాయక విగ్రహాలను నెలకొల్పుకోవాలి. రసాయన రంగుల విగ్రహాలను నెలకొల్పడం హాని చేస్తుంది. భవిష్యత్తు తరాలకు కాలుష్య రహిత వాతావరణాన్ని అందించేందుకు అందరం బాధ్యతతో మెలగాలి.

- లీలాలక్ష్మారెడ్డి, సీజీఆర్, చైర్‌పర్సన్, ఆమనగల్లు

మట్టి వినాయకులనే పూజించాలి



మట్టి వినాయకులనే ప్రతిష్ఠించి పూజించాలి. మట్టి విగ్రహాల పంపిణీకి స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ వేత్తలు, దాతలు ముందుకు రావాలి. కొన్నేళ్లుగా నేను మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నా. పూజలకు మట్టి ప్రతిమలే శ్రేష్ఠం.

- పాపిశెట్టి రాము, ఆమనగల్లు

పీవోపీ విగ్రహాలతో నీటి వనరులు కలుషితం



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన వినాయకులతో పర్యావరణానికి హాని కలుగుతుంది. విగ్రహాల అలంకరణకు వినియోగించే మెర్క్యురీ, లెడ్, క్యాడ్మియంలతో వాతావరణ కాలుష్యం ఏర్పడుంది. ప్రజలు మట్టి వినాయకులనే పెట్టి పూజించాలి.

- గంగాధర్, సీఐ, కడ్తాల్

ఆకర్షణకు పోతే అసలుకే ముప్పు



రంగులతో రూపుదిద్దుకునే వినాయక విగ్రహాలతో భూమి, నీరు కలుషితమై పర్యావరణం దెబ్బ తింటుంది. మట్టి విగ్రహాలనే పూజించి మార్గదర్శకులు కావాలి. రసాయన రంగులు కళ్లకు, ఆరోగ్యానికి కీడు చేస్తాయి. తాగునీటి వనరుల్లో వినాయకులను నిమజ్జనం చేయొద్దు.

- డాక్టర్ హేమ్‌లాల్, ఆమనగల్లు

కొనుగోలుదారులతో తయారీ కేంద్రాలు కిటకిట ...



తాండూరు-లక్ష్మీనారాయణ్‌పూర్ రోడ్డు పక్కన అమ్మకానికి పెట్టిన వినాయక విగ్రహాలు

బషీరాబాద్ : మండలంలోని తాండూరు-లక్ష్మీనారాయణపూర్ మార్గంలో 10 వరకు తయారు కేంద్రాలను ఏర్పాటు చేసి వివిధ రూపాల్లో గణనాథులను సిద్ధం చేశారు. రాజస్థాన్ నుంచి వచ్చినకుటుంబాలు గణనాథులను చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ రూ.5వేల నుంచి రూ.35వేల ధర వరకు గణేశ్ విగ్రహాలు ఉన్నాయి. కర్ణాటక సరిహద్దు గ్రామాల యువకులు వచ్చి గణనాథులను తీసుకువెళ్తున్నారు. చేస్తున్నారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి



మహిళకు కుట్టు మిషన్ అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో 13మంది క్రిస్టియన్ మహిళలకు రూ.20లక్షలు విలువ చేసే కుట్టు మిషన్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అల్పసంఖ్యాక మహిళల ఆర్థిక స్వావలంబనకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పేద క్రిస్టియన్ మహిళలకు కుట్టు మిషన్లను అందజేస్తున్నామన్నారు. మహిళలు కుటుంబ పోషణ, పిల్లల చదువుల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి ఆర్థికంగా ఉండేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళల పేరిట ఇండ్లు, ఉచిత బస్సు సౌకర్యం, వడ్డీలేని రుణాలను అందజేస్తుందన్నారు. ఈ పథకాలను పేద మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సురవరం మృతికి ఎమ్మెల్యే సంతాపం

సీపీఐ నేత, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పట్ల ఎమ్మెల్యే సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా ముద్దు బిడ్డ అయిన సురవరం చిన్నతనం నుంచే కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులై సీపీఐలో చేరి అంచెలంచలుగా ఎదిగారని గుర్తుచేశారు. అణగారిన ప్రజల సంక్షేమానికి ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయమని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. సురవరం పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కేశంపేట: ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. పాపిరెడ్డిగూడ తూర్పుగడ్డ తండాకు చెందిన బుజ్జి అనారోగ్యంతో నిమ్స్‌లో చేరింది. ఆమె చికిత్స ఖర్చులపై స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయించి ఎల్వోసీని బుజ్జి కుటుంబ సభ్యులకు క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు వీరేశ్, మాజీ ఉపసర్పంచ్ సుందరయ్య, యాదయ్య, నారాయణ, శంకర్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న నవీన్ మిట్టల్

కీసర, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): చీర్యాల్ లక్ష్మీనరసింహ స్వామిని రాష్ట్ర విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మహా మండపంలో ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ వారిని సన్మానించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో హరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నవీన్ మిట్టల్ దంపతులకు స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ

గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రాజేశ్

ఆమనగల్లు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):గణేశ్ నవరాత్రోత్సవాలను ప్రజలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు శాంతియుతంగా జరుపుకోవాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ కోరారు. నిర్దేశిత మార్గదర్శకాలను పాటించాలన్నారు, ఆమనగల్లులో శనివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. మండపాల నిర్వహణపై సూచనలు చేశారు. మండపాల ఏర్పాటు, నిమజ్జనంపై పోలీసులకు సమాచారం ఇస్తే బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో డీసీపీ రాజేశ్, ఏఎంసీ చైర్‌పర్సన్ గీతనర్సింహులు, కడ్తాల్ సీఐ గంగాధర్, ఎస్ఐలు ఎస్ఐ బి.వెంకటేశ్, సీతారాం, రాంరెడ్డి, ఎంపీడీవో రెహమాన్, కమిషనర్ శంకర్, డాక్టర్ మంజులాదేవి, ఏఈలు తిరుపతయ్య, శంకర్, ఆర్ఐ సంపత్ పాల్గొన్నారు.

చెరువుల వద్ద భద్రత కల్పించాలి

వినాయక విమజ్జనాల నేపథ్యంలో చెరువు, కుంటల వద్ద ప్రమాదాలకు చోటు లేకుండా భద్రతాచర్యలు తీసుకోవాలని డీసీపీ రాజేశ్ అధికారులకు సూచించారు. విద్యుత్ దీపాలను, క్రేన్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆమనగల్లు సురసముద్రం చెరువును వివిధ శాఖల అధికారులతో ఆయన పరిశీలించారు.

నేర పరిశోధనకు సీసీ కెమెరాలు దోహదం

కడ్తాల్: నేర పరిశోధన, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడుతాయని డీసీపీ రాజేశ్ అన్నారు. మర్రిపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు బాలమోని నారాయణగౌడ్ రూ.10వేలు కడ్తాల పీఎస్‌లో సీఐ గంగాధర్‌కు అందజేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని డీసీపీ కోరారు.

నిబంధనల మేరకు నిర్వహించుకోవాలి

ఇబ్రహీంపట్నం: గణేష్ నవరాత్రోత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నంలోని శాస్త్రా గార్డెన్స్‌లో అధికారులు, గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశంలో మాట్లాడారు. రోడ్లపై, విద్యుత్ లైన్ల కింద మండపాలను ఏర్పాటు చేయొద్దన్నారు. నిబంధనలు పాటించాలన్నారు. ఆసుపత్రులు, విద్యా సంస్థలకు ఇబ్బందుల్లేకుండా పూజలు నిర్వహించాలన్నారు. విగ్రహాలన్నీ ఒకే రోజు నిమజ్జనం చేసేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీవో కె.అనంతరెడ్డి, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు, మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో వెంకటమ్మ, సీఐలు మహేందర్‌రెడ్డి, మధు, నందీశ్వర్‌రెడ్డి, సత్యనారయణ, రవికుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

పర్యాటకులకు పరవశమే



పర్యాటకులు సేదదీరే చోటు

(ఐదో పేజీ తరువాయి)

ఉండే విధంగా ప్యాకేజీలను సిద్ధం చేసింది. ఒక్కొక్క కాటేజీలో వాష్‌రూమ్, టీవీ, బెడ్స్ తదితర విలాసవంతమైన సౌకర్యాలను కల్పించింది. ఆ పక్కనే పర్యాటకులు వంట చేసుకునేలా కిచెన్, డైనింగ్ హాల్ ఏర్పాటు చేశారు. గెస్ట్ హౌస్ సమీపంలోనే వాచ్ టవర్ ఉండడంతో అక్కడి నుంచి చూస్తే అనంతగిరి అడవి ప్రాంతంతో పాటు వికారాబాద్ ప్రాంతం పచ్చని చెట్లు, కొండల మధ్య కనిపిస్తూ కనివిందు చేస్తుంది.

అలరించే పక్షి జాతులు..

దట్టమైన అడవిలో పక్షులు, జింకల పరుగులు, నెమళ్ల నృత్యాలను వీక్షించేందుకు సఫారీ రైడ్‌ను సైతం ప్యాకేజీలో అందిస్తున్నారు. ఇందుకోసం ఇక్కడ ప్రత్యేకంగా రెండు జీపులను ఏర్పాటు చేస్తున్న అధికారులు వాటిలో అనంతగిరి అటవీ ప్రాంతంలో పర్యాటకులను తిప్పనున్నారు. అదే విధంగా ఓ గైడ్ సాయంతో పర్యాటకులకు అడవిలో పక్షి జాతుల గురించి వివరిస్తూ.. అక్కడ ఉన్న చెట్ల ప్రాముఖ్యతను వాటి చరిత్రను కూడా వివరించనున్నారు. అలాగే ఆహ్లాదకరమైన వాతావరణంలో పర్యాటకులు ట్రెక్కింగ్ చేసే విధంగా మొత్తం ఆరు రూట్లు సిద్ధం చేసింది.



అడవిలో సంచరిస్తున్న పందులు (ఫైల్)

ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీల్లోనే అందించాలి



ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజు, అంగన్‌వాడీ టీచర్లు

కేశంపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్. రాజు డిమాండ్ చేశారు. శనివారం అంగన్‌వాడీ టీచర్లతో కలిసి కొత్తపేట జెడ్పీహెచ్ఎస్‌లో ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ.. 6 సంవత్సరాల లోపు పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలతో పాటు పౌష్టికాహారం అందించడానికి 50ఏళ్ల కింద ఐసీడీఎస్ వ్యవస్థ ఏర్పడిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల నిర్వీర్యానికి కుట్ర పన్నుతున్నట్లు పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కాలంలో విద్యార్థులకు ఆంగ్ల విద్యా అవసరమే అయిన అది అంగన్‌వాడీ వ్యవస్థను దెబ్బతీసే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల్లో ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ విద్యను బోధించడానికి అంగన్‌వాడీ టీచర్లు సిద్ధంగా ఉన్నారని, వారికి అవకాశం ఇచ్చి వేతనాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల కన్వీనర్ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

జంగయ్య సేవలు ప్రశంసనీయం

మంచాల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు పోచమోని జంగయ్య సేవలు ప్రశంసనీయమని సీపీఎం నాయకులు అన్నారు. శనివారం ఆయన వర్ధంతి సందర్భంగా బండలేమూర్‌లో నాయకులు జంగయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు పోచమోని కృష్ణ, వెంకటేష్, రంగయ్య, రాములు, దర్శన్ తదితరులున్నారు.

రైతులకు యూరియా పంపిణీ


చౌదరిగూడ : లాల్‌పహాడ్‌లో యూరియా కోసం వచ్చిన రైతులు

చౌదరిగూడ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. శనివారం మండల కేంద్రంతోపాటు లాల్‌పహాడ్ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 480 బస్తాలను పంపిణీ చేశారు.

కంపుతో సహవాసం!

(ఐదో పేజీ తరువాయి)

సమయంలో కొందరు కాంట్రాక్టర్లు రైతులకు డబ్బులు ఆశ చూపి సదరు భూముల్లో మట్టితవ్వి రోడ్డు నిర్మాణానికి అమ్ముకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు జరపడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆ భూములు వ్యవసాయానికి పనికి రాకుండా పోయాయి. సోలీపూర్‌ను మున్సిపాలిటీలో విలీనం చేసిన తర్వాత షాద్‌నగర్ పట్టణంలో సేకరించిన చెత్తను గ్రామంలోని భారీ గుంతల్లో డంపింగ్ చేయడం మొదలు పెట్టారు. దీంతో డంపింగ్ యార్డు నుంచి వెలువడే దుర్వాసనతో సోలీపూర్ గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారు. వేసవిలో డంపింగ్ యార్డులోని చెత్తకు కొందరు ఆకతాయిలు నిప్పు పెడితే ఆ ప్రాంతమంతా పొగ కమ్మేసి సోలీపూర్ వాసులు నరకం చూస్తున్నారు. ఈ సమస్యపై గ్రామస్తులు ధర్నాలు చేసినా, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. గుంతల్లో నీరు నిలిచి దుర్వాసన భరించలేకపోతున్నామని ఆందోళన చెందుతున్నారు. అటుగా వెళ్లే బాటసారులు కూడా దుర్వాసనకు ముక్కున వేలేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. డంపింగ్ యార్డుకు పక్కనే ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించింది. అర్హులైనవారికి త్వరలో ఇళ్లు అందిస్తామని ఇటీవల ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రకటించారు. అయితే పక్కనే డంపింగ్ యార్డు ఉండటం వల్ల ఇళ్ల పంపిణీకి ఆటంకం ఏర్పడుతుంది. అందువల్ల నిర్మాణంలో ఉన్న కొత్త డంపింగ్ యార్డును త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.


సోలీపూర్‌కు మరో పక్కన మురుగు నీరు ఇలా..

షాద్‌నగర్ మురుగు నీరు సోలీపూర్ చెంతకు..

షాద్‌నగర్ పట్టణంలోని పలు కాలనీల నుంచి వెలువడే మురుగు నీరు సోలీపూర్ గ్రామానికి చేరుకుంటుంది. బైపాస్ రోడ్డు, రైల్వే బ్రిడ్జి కింది నుంచి ఆ గ్రామానికి చేరుకుంటుంది. దాంతో చెరువులను తలపించేలా మురుగునీరు కనిపిస్తుంది. బైపాస్ నుంచి గ్రామానికి వెళ్లే దారిలో మురుగు పారుతోంది. అంతేకాకుండా బైపాస్‌కు కుడి వైపున ఉన్న సర్వీస్ రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తుంది. దాంతో ఆ రోడ్డుపై నడవడానికి వీలు లేకుండా ఉంది. గ్రామానికి చివరన మురుగు చేరుతుండటంతో ప్రజలు దుర్వాసనను భరించలేకపోతున్నారు. సుమారు 20 ఎకరాల్లో మురుగు నీరు చేరుతుందని తెలిపారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చేయకుంటే తాము గ్రామంలో నివసించే పరిస్థితి లేదని వాపోతున్నారు.

పూర్తికాని డంపింగ్ యార్డు పనులు

సోలీపూర్ నుంచి డంపింగ్ యార్డును తరలించాలని కొత్తగా ఎలికట్ట- షాద్‌నగర్ మధ్యలో నిర్మాణం పనులు మొదలుపెట్టారు. అక్కడ డంపింగ్ యార్డు నిర్మించి తడి పొడి చెత్తను వేర్వేరుగా రీ సైక్లింగ్ చేయాలని ఆలోచించారు. పనులు మాత్రం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు.

ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం



ప్రశాంతమైన వాతావరణంలో ఉండే తమ గ్రామం ప్రస్తుతం కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. విముక్తి కల్పించాలని ధర్నాలు చేశాం. అధికారులకు వినతి పత్రాలు ఇచ్చాం. అయినా సమస్య పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా మాకు న్యాయం చేయాలి.

-శ్రీశైలం, సోలీపూర్ గ్రామస్తుడు

తరచూ రోగాల బారిన పడుతున్నాం



ఒక పక్క డంపింగ్ యార్డు, మరో పక్క మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన భరించలేకపోతున్నాం. తరచూ గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారు. మున్సిపాలిటీలో విలీనం తర్వాత తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు. రెండు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి.

- జంగయ్య, సోలీపూర్ గ్రామస్తుడు

క్రైం కార్నర్

ఆన్‌లైన్ మోసాలు.. ముగ్గురి అరెస్టు

తలకొండపల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తలకొండపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. శనివారం తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని ఓం శ్రీ సాయికిరాణం వద్దకు గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వెళ్లి గూగుల్‌పే ద్వారా రూ.2వేలు పంపిస్తాం తమకు నగదు రూపంలో ఇవ్వాలని దుకాణ యజమానిని కోరారు. ట్రాన్సక్షన్ చూపించడంతో నిజమని నమ్మిన దుకాణ నిర్వాహకుడు రూ.2 వేలు నగదు ఇచ్చాడు. కొద్దిసేపటి తర్వాత తన అకౌంట్‌ను చెక్ చేసుకోగా నగదు జమ కాలేదు. దీంతో మోసపోయిన దుకాణ దారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్రైమ్ కానిస్టేబుల్ జాషువా సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులు చుక్కాపూర్ గ్రామానికి చెందిన దాసరి మహేశ్, బేగరి నాని, ఆమనగల్లుకు చెందిన వడ్త్యావత్ పవన్‌లుగా గుర్తించారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రూ.2వేల నగదు, 3 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన ఎస్‌ఐ శేఖర్, కానిస్టేబుళ్లు జాషువా, శ్రీనివాస్, నిరంజన్ నాయక్, సంజీవరెడ్డిలను ఎస్పై ఈ సందర్భంగా అభినందించారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట


ఎమ్మెల్యే కసిరెడ్డికి సబ్సిడీ పరికరాల వివరాలు తెలియజేస్తున్న ఏడీఏ శోభారాణి

ఆమనగల్లు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. వ్యవసాయశాఖ అధికారులతో శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏడీఏ శోభారాణి, ఏవోలు శ్రీనివాస్‌గౌడ్, రేణుక చక్రవర్తి, అరుణకుమారిలు పాల్గొన్నారు. రైతులకు ప్రభుత్వం నుంచి అందించే యాంత్రిక పరికరాల గురించి ఎమ్మెల్యేకు అధికారులు వివరించారు. ఆమనగల్లు వ్యవసాయ సబ్ డివిజన్‌కు వివిధ రకాల వ్యవసాయ పనిముట్లు మంజూరైనట్లు ఏడీఏ తెలిపారు. రైతులు సబ్సిడీ పనిముట్లను పొందవచ్చన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. కేంద్ర ప్రభుత్వం సాగుకనుగుణంగా యూరియాను కేటాయించడం లేదని ఆరోపించారు.

రక్తదానం.. మహాదానం : ఎమ్మెల్సీ


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆపత్కాలంలో మనిషి ప్రాణాలను కాపాడే రక్తదానం మహా గొప్పదానమని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. విశ్వబంధుత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని షాద్‌నగర్ విజయనగర్ కాలనీలోని బ్రహ్మకుమారీస్ సమాజ సేవా మందిరంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్సీ ప్రారంభించి మాట్లాడారు. రాజయోగిని ప్రకాశమణి దాదీ 18వ పుణ్యస్మృతిని పురస్కరించుకుని మెగా రక్తదానశిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. బ్రహ్మకుమారీస్ సమాజ సేవా మందిరంపై అంతస్తు నిర్మాణాన్ని పూర్తి చేయడానికి రూ.5లక్షల విరాళం ఇస్తానని నవీన్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. బ్రహ్మకుమారీలు శోభ, లక్ష్మి, షాద్‌నగర్ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కె.మదన్‌మోహన్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు బెజుగం రమేష్, యారం శేఖర్‌రెడ్డి, ఎం.నర్సింహారెడ్డి, నందకిషోర్, నందీశ్వర్, సాయికృష్ణ, అశోక్, శ్రీకాంత్‌గౌడ్, లయన్స్‌క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ టౌన్ అధ్యక్షుడు రవికుమార్, లయన్ రామకృష్ణారెడ్డి, ఎంవీఎస్ రంగయ్య, సందీప్, శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో హామీలన్నీ అమలు

కందుకూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నట్లు మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ అఫ్జల్ బేగ్, ఇ.రాకేశ్‌గౌడ్‌లు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం మండలంలోని నేదునూరులో 77 కుటుంబాలకు తెల్లరేషన్ కార్డులను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి చొరవతో గ్రామంలో అభివృద్ధి పనులకు రూ.30కోట్లు మంజూరైనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎ.బాలయ్య, ఎన్.నాగరాజు, జి.సంజీవరెడ్డి, పుష్ప దర్శన్, సాధ పాండురంగారెడ్డి, బి.సురేష్, ఎస్.మాధవరెడ్డి, జి.రాములుగౌడ్, ఎం.రాములు, రాకేశ్‌గౌడ్, కె.మహేష్, మహేందర్, డి.రాములు, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు అందిస్తున్న సబితారెడ్డి

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ముచ్చర్లకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను శనివారం మీర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మన్నె జయేందర్ ముదిరాజ్, బండ నర్సింహ, టి.శ్రావణ్‌కుమార్, బి.శ్రీనివాస్, కె.బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

కడ్తాల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నిరుపేదలు, బాధిత కుటుంబాలకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తోడ్పాటునందిస్తుందని ట్రస్ట్ చైర్మన్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మక్తమాదారంలో అనారోగ్యంతో మృతిచెందిన నింగ్యారి రామయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు, రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కడ్తాలకు చెందిన మారెమోని శివ కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసామందించారు. మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ మంజులాచంద్రమౌళి, సర్పంచ్ సులోచన సాయిలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, సత్యనారాయణ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ పెళ్లికి చేయూత

ఆమనగల్లు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు లేని నిరుపేద ఆడబిడ్డ పెళ్లికి ఐక్యత ఫౌండేషన్ తోడ్పాటునందించింది. సుభాష్‌నగర్ కాలనీకి చెందిన మహేశ్వరి వివాహం సందర్భంగా రూ.10వేలు ట్రస్ట్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చారు. శనివారం ఆమనగల్లు ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో నగదు, పట్టు చీరను అందజేశారు. సభ్యులు గణేశ్, శేఖర్, శ్రీను, ఝాన్సీ, గంగ తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

సురవరం మరణం పార్టీకి తీరని లోటు


ఇబ్రహీంపట్నం : సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చేవెళ్ల/ఇబ్రహీంపట్నం/మంచాల/మొయినాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పార్టీకి తీరని లోటు అని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, జిల్లా కార్యవర్గసభ్యుడు ప్రభులింగం తెలిపారు. శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలువేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మాజీ పార్లమెంట్ సభ్యుడు సురవరం మరణం బాధాకరమన్నారు. ఆయన ఆశయాలను పార్టీ కొనసాగిస్తుందన్నారు. మండల కార్యదర్శులు సత్తిరెడ్డి,శ్రీనివాస్, డివిజన్ కార్యదర్శి దేవేందర్, నాయకులు మక్బూల్, సుధాకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డికి ఆ పార్టీ నాయకులు ఇబ్రహీంపట్నంలో ఘనంగా నివాళులర్పించారు. చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఆయన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోతామని నినదించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కావలి నర్సింహ, నాయకులు శివరాల యాదయ్య, ఆకుల చంద్రకళ, పోచమోని నీలమ్మ, మాజీ సర్పంచ్ యాదయ్య, బాలయ్య, తదితరులు న్నారు. నిరంతరం పేదల సమస్యల పరిష్కారం కోసం పనిచేసిన పేదల పెన్నిధిని కోల్పోయామని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సీపీఐ నాయకులు కావలి నర్సింహ అన్నారు. మాజీ ఎంపీ సురవరం మృతికి సంతాపసూచకంగా మంచాల మండల కేంద్రంలో సీపీఐ నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పోచమోని నీలమ్మ, బాలయ్య, అలీమొద్దీన్, రాజునాయక్ తదితరులున్నారు. సురవరం మరణం పార్టీకి తీరని లోటు అని సీపీఐ మొయినాబాద్ మండల కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు ఎండీ జలీల్, వెంకటయ్య, రాములు, కాశీం, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం కలిగి ఉండాలి


కేశంపేట : సత్యనారాయణ స్వామి వ్రతంలో భక్తులు

కేశంపేట/చేవెళ్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. సంతాపూర్ అటవీ ప్రాంతంలో వెలిసిన పానకాల లక్ష్మీనరసింహ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈమేరకు పానకాల లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వరకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని మాజీ సర్పంచ్ అంజయ్య ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆయన రెండు, మూడు నెలల్లో ఆలయం వరకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని వివరించారు. కాగా, పానకాల లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆలయం ఆవరణలో సంతాపూర్, కొనాయపల్లి గ్రామాల భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామివ్రతం ఆచరించారు. పూజారులు సత్యనారాయణ స్వామి కథలను భక్తులకు వినిపించారు. మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, మహిళా అధ్యక్షురాలు రాణి, జగదీశ్వరప్ప, పల్లె ఆనంద్ కుమార్, సురేష్ రెడ్డి, యెన్నం శ్రీధర్‌రెడ్డి, సురేష్ మాదిగ, త్రైద పర్వతాలు, అనసూయమ్మ, రాములు, తదితరలు పాల్గొన్నారు. శ్రావణ మాసం చివరి శనివారం, అమావాస్య సందర్భంగా చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ మాసం పురస్కరించుకొని వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారిని అర్చకులు పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఫౌండర్‌ట్రస్టీ దేవుని వామనాచార్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


చేవెళ్ల : వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

క్రమశిక్షణతో చదువుకోవాలి


బహుమతి అందిస్తున్న ఎస్సై శిరీష

చేవెళ్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుంటూ ఉన్నతులుగా ఎదగాలని ఎస్సైలు వనం శిరీష, బి.శిరీష, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని వివేకానంద జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ పార్టీని కేజీఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా ఎస్సైలు, చైర్మన్ బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి, గుడిపల్లి శ్రీకాంత్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి

కేశంపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తాచాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి(పీవీఆర్)నాయకులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం మండల కేంద్రంలో ముఖ్యనాయకులతో చాయ్‌పే చర్చ నిర్వహించారు. స్థానిక ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయాలని, పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత సీనియర్ నాయకుల మీద ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి ఏర్పడుతుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రజలకు బీజేపీ ఎలాంటి ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తుందో వివరించాలని సూచించారు. అనంతరం సంతాపూర్ అటవీ ప్రాంతంలో పానకాల లక్ష్మీనరసింహస్వామిని దర్శనం చేసుకున్న పీవీఆర్ పూజలో పాల్గొన్నారు. ఓబీసీమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహయాదవ్, నరేందర్‌రెడ్డి, మహేష్, తిరుపతి, చౌడం శ్రీనివాస్, శివాజీ, గోపాల్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

శంషాబాద్ రూరల్/యాచారం/కొత్తూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. శనివారం మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావుతో కలిసి తొండుపల్లి, పోశెట్టిగూడ చెరువులను పరిశీలించారు. మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్రేన్లను ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే విషయమై సిబ్బందికి సూచించారు. సీఐ నరేందర్‌రెడ్డి సిబ్బంది ఉన్నారు. వినాయక మంటపాలు, ఇతర చోట్ల డీజేలు పెడితే చట్టపరంగా కేసులు నమోదు చేసి డీజేలను సీజ్ చేస్తామని యాచారం సీఐ నంధీశ్వర్‌రెడ్డి తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో వివిధ డీజే నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీజే వాడేందుకు అనుమతి తీసుకోవాలన్నారు. వినాయక చవితిని శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కొత్తూర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారావ్ అన్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో శాంతి సమావేశంలో ఏర్పాటు చేశారు. వినాయక మండపాల నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ప్రతీఒక్కరు మట్టి వినాయకులను ప్రతిష్ఠించుకోవాలన్నారు.

సంక్షిప్తంగా..

తలకొండపల్లి : వెల్జాల్‌లో ఖిల్లా మైసమ్మ బోనాలను శనివారం సాయంత్రం జరుపుకున్నారు. బోనపు కుండలతో మహిళలు ర్యాలీగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఏఎంసీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంబాజీ, మాజీ సర్పంచ్‌లు నర్సిములు, అజీజ్, కాంగ్రెస్ మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఆరిఫ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ రూరల్ : క్రీడలతో శారీరక ధారుఢ్యం పెరుగుతుందని మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లిలో శనివారం క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. భాస్కర్, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

కొందుర్గు : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ మండలాధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని రాంచంద్రపూర్, పులుసుమామిడి, పర్వతాపూర్, శ్రీరంగాపూర్‌లలో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను పరిశీలించి విద్యార్థులు, టీచర్లను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు.

తండ్రి జ్ఞాపకార్థం.. తనయుడి విరాళం


ఎమ్మెల్యేకు చెక్కు ఇస్తున్న విజయ్‌కుమార్

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడిగా పనిచేసిన తన తండ్రి దివంగత కుంచెం శ్రీశైలం జ్ఞాపకార్థం విజయ్ కుమార్ విద్యాభివృద్ధి కోసం రూ.5లక్షలు విరాళంగా ఇచ్చారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దాతల సహకారాన్ని ఆశించి నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం కోసం శనివారం ఐదు లక్షల చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. విజయ్‌కుమార్‌ను ఆయన అభినందించారు. కొందుర్గు సింగిల్‌విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి, కొత్తూర్ మాజీ సర్పంచ్ సుదర్శన్‌గౌడ్‌లు ఉన్నారు.

కాలుష్యం బారి నుంచి కాపాడండి

షాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాలుష్యం బారి నుంచి కాపాడాలని గ్రామస్తులు అధికారులను వేడుకుంటున్నారు. మండలంలోని చందనవెళ్లి గ్రామంలో ఉన్న కుందస్ పరిశ్రమ నుంచి రసాయనిక వ్యార్థాలు వెలువడుతుండటంతో పశువులు చనిపోతున్నాయని గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు శనివారం రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులను కలిసి వినతిపత్రం అందించారు. కంపెనీ యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు చేవెళ్ల స్వామి, వేమారెడ్డి, రాఘవాచారి, శ్రీశైలం, మల్లేష్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, రమేశ్, రాజమల్లు, రాంచందర్, శ్రీహరి, శ్రీనివాస్, నిరంజన్‌కుమార్, వెంకటేశ్, అంజయ్య తదితరులు ఉన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి


చేవెళ్ల : డీటీకి వినతిపత్రమిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి/చేవెళ్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గణపురం సుధీర్ తెలిపారు. ఈమేరకు శనివారం చేవెళ్ల మండల డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్రకు వినతిపత్రం అందించారు. డివిజన్ అధ్యక్షుడు మోర లక్ష్మణ్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, రమణారెడ్డి, మోహన్ తదితరులు ఉన్నారు. అలాగే సీపీఎస్‌ను ప్రభుత్వం రద్దు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం శంకర్‌పల్లి మండలాధ్యక్షుడు జంగయ్య డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో మధ్యాహ్న సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈమేరకు శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్‌కు జంగయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీను, నాయకులు నందు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పట్టని ప్రభుత్వం


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సేన నాయకులు

షాద్‌నగర్ అర్బన్ 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను విడుదల చేయాలని, ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు టీకే శివప్రసాద్ ఆరోపించారు. విద్యార్థి సేన ఆధ్వర్యంలో శనివారం షాద్‌నగర్ పట్టణంలో విద్యార్థుల సమస్యలను పరిష్కంచాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.8వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు గడుస్తున్నా బకాయిలను చెల్లించకపోతే పేద విద్యార్థులు చదువు ఎలా ముందుకు వెళ్తుందని ప్రశ్నించారు. విద్యార్థి సేన నాయకులు నర్సింహ్మ, మహేష్, రమేష్, వెంకట్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంఘం మండల కార్యవర్గం

చేవెళ్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రాఫర్ల సంఘం మండల నూతన కార్యవర్గాన్ని శనివారం చేవెళ్లలో ఎన్నుకున్నారు. సంఘం మండలాధ్యక్షుడిగా కిషన్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, కార్యదర్శిగా బి.మల్లేష్‌యాదవ్, సంయుక్త కార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా జనార్దన్, సలహాదారులుగా సునీల్, ఆశోక్ ఎన్నికయ్యారు. కిషన్ మాట్లాడుతూ ఫొటో, వీడియోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈమేరకు నూతన కార్యవర్గాన్ని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డిలు అభినందించారు. సభ్యులు పాండుయాదవ్, నసీరుద్దీన్, శివశంకర్, దశరథ్, యాదయ్య, మసియొద్దీన్, తదితరులున్నారు.


నూతన ఫొటోగ్రాఫర్ల సంఘం సభ్యులు